3.25కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి నిందితుల అరెస్టు.. బైక్ స్వాధీనం

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్‌కిరణ్

పరిగి పట్టణ శివారులో ఘటన

వివరాలు 7లో..



శివ మహాపడి పూజలో స్పీకర్

వికారాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శివ మహాపడి పూజ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. వికారాబాద్ మండల పరిధిలోని పీలారం గ్రామంలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ జెడ్పీటీసీ మహిపాల్ రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు, శివ స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సైబర్ స్పేస్‌ను ప్రారంభిస్తున్న బాలకృష్ణా రెడ్డి

సైబర్ నేరాల నియంత్రణకు

అధ్యయనం అవసరం

జేఎన్‌టీయూహెచ్ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న డిజిటలైజేషన్ వ్యవస్థతో సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టడానికి సైబర్ వ్యవస్థపై మరింత అధ్యయనం అవసరమని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్, జేఎన్‌టీయూహెచ్ ఇన్‌చార్జి వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ స్పేస్‌ను ప్రారంభించి ఒక రోజు సెమినార్‌ను నిర్వహించారు. బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతీది డిజిటలైజేషన్ కావడంతో సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. వింగ్ కమాండర్ గరిగి పాటి శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం ప్రజలు వాడే స్మార్ట్ ఫోన్ల నుంచి స్మార్ట్ వాచ్‌ల వరకు సైబర్ నేరాలను ప్రేరేపించవచ్చన్నారు. కార్యక్రమంలో మహింద్రా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ బంగారు లక్ష్మి, కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్ రెడ్డి, త్రిలోక్ రెడ్డి, మోహన్, ప్రిన్సిపాల్ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

యాసంగి సాగుపై అన్నదాతల ఆశలు అడియాసలవుతున్నాయి. ఈ సీజన్‌లో అదును దాటుతున్నా ఉమ్మడి జిల్లాలో కనీసం సగం విస్తీర్ణంలో కూడా సాగు కాకపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. భారీగా లోటు వర్షపాతం నమోదు కావడంతో పాటు భూగర్భజలాలు గణనీయంగా పడిపోతుండడం రైతాంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. సీజన్ దాదాపు చివరి దశకు చేరినప్పటికీ రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 36 శాతమే సాగు చేయడం గమనార్హం. అలాగే వికారాబాద్ జిల్లాలో 64 శాతం సాగు చేశారు. ప్రధాన పంటైన వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. రాష్ట్రంలో అతి తక్కువ పంటలు సాగు రంగారెడ్డి జిల్లాలోనే జరగడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. మిగతా జిల్లాల్లో సగటు 80 శాతానికిపైగానే సాగు చేశారు.



యాచారం మండలం చిన్నతూండ్లలో వరి నాట్లు వేస్తున్న కూలీలు

యాసంగిపై

నీలినీడలు

రైతాంగానికి క'న్నీటి' కష్టాలు

- అడుగంటిన భూగర్భజలాలు
- 40శాతం లోటు వర్షపాతం నమోదు
- సగటు సాగులో సగమూ గగనమే
- వరి సాగు అంతంత మాత్రమే
- రంగారెడ్డి జిల్లాలో సాగు 36 శాతమే
- రాష్ట్రంలోనే ఇది అత్యల్పం

జిల్లాల వారీగా యాసంగి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

జిల్లా	సగటు	ప్రస్తుతం	సాగుశాతం
రంగారెడ్డి	1,02,063	36,995	36
వికారాబాద్	1,53,000	96,541	64
మేడ్చల్	13,849	11,235	81

వరి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

జిల్లా	సగటు	ప్రస్తుతం	సాగుశాతం
రంగారెడ్డి	71,775	25,187	35.1
వికారాబాద్	91,628	54,005	58.9
మేడ్చల్	11,241	10,134	90.1

పరిగి/వికారాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రంగారెడ్డి జిల్లాతో పోలిస్తే వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో సాగు పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంది. ఇదిలా ఉంటే యాసంగిలో బోర్లు ఉన్న రైతులు కొన్ని పంటలు వేస్తున్నారు. దీంతో సాగు మరో 10 నుంచి 20 శాతం మాత్రమే పెరిగే అవకాశాలున్నాయి. వాస్తవానికి ఈ సీజన్‌లో వరి సాధారణంగా కంటే ఎక్కువగా సాగు అవుతుందని అధికారులు అంచనా వేశారు. సాధారణంగా జనవరి చివరి నాటికి వరి నాట్లు పూర్తి కావాల్సి ఉంది. వివిధ కారణాలతో కొన్ని చోట్ల వారం, పది రోజులు అటూ ఇటుగా వరినాట్లు వేస్తారు. కానీ ఫిబ్రవరి రెండో వారమైనప్పటికీ పూర్తి స్థాయిలో నాట్లు పూర్తి కాని పరిస్థితి. వాతావరణ పరిస్థితులతో పాటు, కొత్త రుణాలు అందక, రైతుభరోసా(పెట్టుబడి సాయం) సకాలంలో అందక ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు రుణమాఫీ సకాలంలో అమలు చేయకపోవడంతో పాటు సీజన్ ముగుస్తున్నా నేటికీ కొత్త రుణాలు రాక క్షేత్రస్థాయిలో రైతులు అవస్థలు పడుతున్నారు. ఏదో విధంగా నారుమళ్లు పోసినా కొందరు రైతులను

మిగతా 7వ పేజీలో...

ఆలస్యంగానే వరి నాట్లు



ఈ సారి యాసంగిలో వరినాట్లు వేయడంలో చాలా ఆసల్యం జరిగింది. ఈ సమయానికి కలుపు తీత పనులు చేయాల్సి ఉంటుంది. కానీ ఇంకా నాట్లు వేస్తూనే ఉన్నారు. అదును ప్రకారం సంక్రాంతి నాటికి నాట్లు పూర్తి చేయాలి. పరిస్థితుల కారణంగా ఆలస్యమైంది. జిల్లాలో 91,628 ఎకరాల్లో వరిసాగు చేయాల్సి ఉంది. కాగా, ఇప్పటి వరకు 54 వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఇంకా పది రోజుల వరకు లక్ష్యం సాధించే అవకాశం ఉంది.

-మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి, వికారాబాద్

కీసరగుట్ట ఆలయ అభివృద్ధికి కృషి

ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి

కీసర, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయనున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆలయ పాలకమండలి సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వేదపండితులు మహేందర్ రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్‌గా తటాకం నారాయణ శర్మ, సభ్యులుగా మధుసూదన్‌రెడ్డి, కౌకుంట్ల కృష్ణారెడ్డి, కందాడి రాజిరెడ్డి, పోచమైన రాజు, రెడ్డబోయిన ప్రవీణ్‌కుమార్, మెరుగు ముత్యాలు, జూపల్లి సాయిలు, దుండిగల్ల దుర్గప్రసాద్‌గౌడ్, సామల అమరేందర్, సగ్గు అనిత, నల్లోల కుమార్, రాపోలు శంకరయ్య, పాముకుంట్ల ప్రభాకర్‌గౌడ్‌లచేత ఈవో సుధాకర్‌రెడ్డి ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని నూతన పాలకవర్గానికి సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, నాయకులు కందుల కుమార్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, పోలీసు కృష్ణ, బస్వయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పాలకమండలి ప్రమాణస్వీకారోత్సవంలో చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, తోటకూర వజ్రేష్‌యాదవ్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మండలంలోని చీర్యాల్‌లో బుధవారం ఇందిరమ్మ ఇంటి పట్టాలను మహేందర్‌రెడ్డి అందజేశారు. కాగా, 40 మందికి గాను 27 మందికే ఇందిరమ్మ ఇంటి పట్టాలను ఇచ్చారని, అవి కూడా స్థానికులకు ఎవరికి రాలేదని, స్థానికేతరులకు వచ్చాయని వారు నిలదీశారు. మిగతా 13 మంది పట్టాలలో చిన్న పొరబాట్లు ఉన్నాయని, వాటిని తహశీల్దారు సరిచేసి ఇస్తారని మహేందర్‌రెడ్డి స్థానికులను సముదాయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కీసర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల కృష్ణయాదవ్, కందుల కుమార్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

భక్తులకు ఇబ్బందులు కలగొద్దు

కలెక్టర్ ప్రతీక్‌జైన్ ▸▸ పోలెపల్లి ఎల్లమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన

దుద్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లి రేణుక ఎల్లమ్మ జాతర 20 నుంచి 24 వరకు జరగనుంది. కాగా, బుధవారం సాయంత్రం కలెక్టర్ ప్రతీక్‌జైన్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు కానుండటంతో బందోబస్తుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆరా తీశారు. వాహనాల పార్కింగ్, తాగునీరు, లైటింగ్స్, మూత్ర శాలలకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆలయ మేనేజర్, ఉత్సవ కమిటీ సభ్యులకు కలెక్టర్ ఆదిశించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సేవాలాల్ జయంతి వేడుకలకు రండి

▸▸ సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

కొడంగల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో 15వ తేదీన నిర్వహించే సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు రావాలని సేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శివచౌహన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో కలిసి సంబంధిత కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ శంకర్‌నాయక్, మాజీ సర్పంచ్ రెడ్యానాయక్, బాపల్లి సంతోష్, రాంచందర్, భానునాయక్, రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ ఆర్టీఏ సభ్యుడిగా జైపాల్‌రెడ్డి

ఉత్తర్వులు జారీ చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్



ఎంవీఐ శ్రీనివాస్ నుంచి నియామక ఉత్తర్వు అందుకుంటున్న జైపాల్‌రెడ్డి

శామీర్‌పేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా రవాణా శాఖ (జిల్లా రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ, ఆర్టీఏ) ప్రాంతీయ నూతన సభ్యుడిగా శామీర్‌పేట మండలం దేవరయాంజాల్‌కు చెందిన తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ బీమిడి జైపాల్ రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ పదవిలో జైపాల్‌రెడ్డి రెండేళ్ల పాటు ఉంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ) శ్రీనివాస్ దేవరయాంజాల్‌లోని జైపాల్‌రెడ్డి నివాసానికి వచ్చి ఆయనకు నియామక పత్రాన్ని, పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, తన సేవలను గుర్తించి జిల్లా ఆర్టీఏ సభ్యునిగా నియమించినందుకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జైపాల్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలను అందిస్తానన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దానయ్య

పూడూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దానయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలో జిల్లాలోని వివిధ పాఠశాలలను సందర్శించి, సంఘం క్యాలెండర్, డైరీలను ఉపాధ్యాయులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం రిటైర్డ్ ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతులకు అడ్డుగా ఉన్న జీవోను రద్దు చేసి 342 జీవోను ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పి.జనార్దన్‌రెడ్డి, జిల్లా నాయకులు భగవాన్ కృష్ణ, బాలరాజ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దానయ్య



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న ఉమాహారతి

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

▸▸ అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి

పూడూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలని అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి సూచించారు. 'బేటీ బచావో- బేటీ పడావో' స్కీం పదేళ్ల వేడుకల్లో భాగంగా జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో కేజీబీవీ పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. బుధవారం పూడూరు మండల కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటలు ఆడటం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రతి ఒక్కరూ ఆటలకు సమయం ఇవ్వాలని, చదువులో కూడా చురుగ్గా ఉండాలని సూచించారు. ఈ పోటీలు మొదటి రోజు మండల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించారు. ఇందులో భాగంగా కబడ్డీ పోటీలో దోమ కేజీబీవీ పాఠశాల విద్యార్థులు, ఖోఖో పోటీల్లో పూడూరు కేజీబీవీ విద్యార్థులు గెలుపొందారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని కేజీబీవీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, మహిళా సాధికారత బృందం సభ్యులు పాల్గొన్నారు.

నేడు లగచర్ల రైతులతో కలెక్టర్ సమావేశం

దుద్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లగచర్ల, రోటిబండ, పులిచర్ల కుంట తండాల రైతులతో గురువారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ సమావేశం కానున్నట్లు తహసీల్దార్ కిషన్‌నాయక్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు లగచర్ల శివారులోని 102, 117, 120, 121 సర్వే నంబర్లలోని 110 ఎకరాల 32 గుంటల లావణి పట్టాదారులతో జిల్లా స్థాయి నెగోసెషన్ కమిటీ గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా సర్వే నంబర్లలో భూములు కలిగిన రైతులు హాజరు కావాలని ఆయన కోరారు.



పాంబండ గిరి ప్రదక్షిణలో భక్తజనం

శివనామస్మరణతో మార్మోగిన పాంబండ

▸▸ గిరి ప్రదక్షిణలో పాల్గొన్న వేలాది మంది భక్తులు

కులకచర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవెల్కిచర్ల పాంబండలో బుధవారం నిర్వహించిన గిరి ప్రదక్షిణలో వేల సంఖ్యలో భక్తజనం పాల్గొన్నారు. దీంతో పాంబండ శివనామస్మరణతో మార్మోగింది. అత్యధికంగా మహిళలు ఈ ప్రదక్షిణలో పాల్గొన్నారు. ప్రతీ నెల పౌర్ణమి రోజు గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. వచ్చిన భక్తులు శ్రీ రామలింగేశ్వరస్వామి దర్శించుకున్నారు. అర్చకులు పాండు శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సతీమణి ఉమారామ్మోహన్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, దేవాలయ చైర్మన్ మైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సత్యమ్మ, కోట్ల మైపాల్‌రెడ్డి, భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, యూత్ మండల అధ్యక్షుడు జంగయ్య, ఆనంద్, భరత్‌కుమార్, నిర్వాహకులు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మండల కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తలకొండపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండల కేంద్రం చేయాలని గ్రామ, జేఏసీ నాయకులు నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డిలను కోరారు. బుధవారం వారికి మాజీ వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జయమ్మవెంకటయ్య, జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, ఇతర నాయకులు వినతిపత్రం ఇచ్చారు. గట్టిప్పలపల్లిని మండలం చేయాలని ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. సమీప గ్రామాల రైతులకు, విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుందని వివరించారు. నేతలు స్పందిస్తూ.. ప్రజల ఆకాంక్షను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతామన్నారు. డేవిడ్, ఆంజనేయులు, శరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం



అంబులెన్స్‌లో తల్లీశిశువు, వైద్య సిబ్బంది

బషీరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులొచ్చిన గర్భిణిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా ఆమె మగ శిశువుకు జన్మనిచ్చింది. ఈ ఘటన నవాల్గ గేటు సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ఎక్మాయికి చెందిన చంద్రకళకు పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేశారు. అంబులెన్స్‌లో ఆమెను తాండూరులోని మాతాశిశు, ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా నొప్పులు అధికమయ్యాయి. నవాల్గ గేటు వద్ద ఈఎంటీ హరీష్, పైలట్ దస్తప్ప నార్మల్ డెలివరీ చేశారు. అనంతరం తల్లీశిశువులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పోలీస్ బదిలీల్లో చేతివాటం

మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఆరోపణ



వికారాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అడ్డగోలు దోపిడీపై దృష్టిపెట్టిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పోలీసుల పోస్టింగ్‌లకు డిమాండ్‌ను బట్టి రేట్‌ను ఫిక్స్ చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆరోపించారు. పోలీసు బదిలీలను తమ అవసరాలకు అనుకూలంగా మార్చుకుంటూ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో పోలీసు ట్రాన్స్‌ఫర్ల కోసం ఎవరి వద్దా డబ్బులు తీసుకోలేదన్నారు. వారి డ్యూటీని వారు సజావుగా చేసుకునేలా సహకరించాలని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలో తీరు మారిందన్నారు. అనుకున్న చోటికి బదిలీ కావాలంటే డబ్బులు చెల్లించాల్సిందేనని, ఆ భారాన్ని పోలీసులు ప్రజలపై మోపుతున్నారని విమర్శించారు. ఇకనైనా కాంగ్రెస్ నాయకులు ఇలాంటి వాటికి స్వస్తి పలకాలని ఆనంద్ డిమాండ్ చేశారు.

18న బీఆర్ఎస్ రైతు మహాధర్నా



ధర్నా చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో ఈ నెల 18న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు మహాధర్నా చేపడుతామని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, మిషన్ భగీరథ రాష్ట్ర కార్పొరేషన్ మాజీ వైస్‌చైర్మన్ వెంకటేశ్ చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఎండగడతామన్నారు. బుధవారం బీఆర్ఎస్ అమన్గల్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్ అధ్యక్షతన ధర్నా ఏర్పాట్లపై నాయకులు చర్చించారు. మహాధర్నాకు నియోజకవర్గంలోని ఆరు మండలాలు, రెండు మున్సిపాలిటీల నుంచి 15వేల మందిని సమీకరిస్తామన్నారు. ఆమనగల్లు సమీప మాడ్గుల రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలంలో ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. కేటీఆర్ హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులు, రైతులు తరలిరావాలని కోరారు. రైతు మహాదీక్షకు కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అనురాధపత్యానాయక్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు వెంకటేశ్, నిర్మలశ్రీశైలంగౌడ్, పి.అర్జున్‌రావు, సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, పత్యానాయక్, ఖలీల్, రమేశ్‌నాయక్, జగన్, శ్రీనునాయక్, రమేశ్, గణేశ్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో నినదిస్తున్న భూ నిర్వాసితులు

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

షాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించే వరకు పోరాటం చేస్తామని భూనిర్వాసితుల సంఘం మండల అధ్యక్షుడు నీరటి ఆంజనేయులు అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో చందన్‌వెల్లి, హైతాబాద్, సీతారాంపూర్, రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన నిర్వాసితులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల భూములు లాక్కొని న్యాయమైన పరిహారం ఇవ్వలేదన్నారు. నిర్వాసితులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి పాలనలోకొచ్చి 14నెలలవుతున్నా పరిహారం చెల్లించలేదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని, లేదంటే నిర్వాసితులంతా సెక్రటరియేట్, అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు సుభద్రారెడ్డి, నాయకులు రెడ్డయ్య, నర్సింహులు, భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



పరిగిలో 3.25కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరి అరెస్టు.. బైక్ స్వాధీనం

పరిగి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 3.25కిలోల గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన బుధవారం రాత్రి వికారాబాద్ జిల్లా పరిగి శివారులో జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రం సేడం తాలుకా పరిధిలోని నాడెపల్లితండాకు చెందిన శ్రీనివాస్ చవాన్ తన పొలంలో గంజాయి సాగు చేస్తున్నాడు. ఇలా పండించిన గంజాయిని నగరానికి తరలించి విక్రయిస్తుంటాడు. రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులకు అందిన రహస్య సమాచారం మేరకు ఏఈఎస్ జీవన్‌కిరణ్ ఆధ్వర్యంలో పట్టణ శివారులో రూట్‌వాచ్ చేస్తుండగా అనుమానాస్పద బైక్‌ను నిలిపి తనిఖీ చేశారు. శ్రీనివాస్ చవాన్, ముధోల్‌కు చెందిన అనిల్ ఇద్దరూ కలిసి అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి గంజాయితోపాటు, బైక్‌ను, ఆ ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నట్లు జీవన్‌కిరణ్ తెలిపారు. కర్ణాటకలోని నాడెపల్లితండాలోని శ్రీనివాస్‌చవాన్ కొంతకాలంగా గంజాయిని పండించి నగరానికి తరలించి అమ్ముతుంటారని తమ విచారణలో తేలిందని తెలిపారు.

కమనీయం.. రమణీయం

కల్యాణోత్సవం



చీకటి వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న పండితులు

పులిమామిడిలోని చీకటి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు ఆలయ ట్రస్ట్ చైర్మన్ భాస్కరశర్మ ఆధ్వర్యంలో పూజలు చేస్తున్నారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. పులిమామిడి, జైత్వారం, బాచుపల్లి, ధన్నారం, పెద్దమ్మ తండా, దావుత్‌గూడ తండాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభివాణిదేవి, ఎంపీడీవో సరిత, పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్, నాయకులు సంధ్యాధామోదర్‌గౌడ్, బి.పాండురంగారెడ్డి, పి.రవీందర్, దామోదర్‌గౌడ్, పి.వెంకటేష్, మహేందర్‌రెడ్డి, మహేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి)



మరకత శివాలయంలో సామూహిక వ్రతాలు

మరకత శివాలయంలో సామూహిక సత్యన్నారాయణస్వామి వ్రతాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. చందిప్పశివాలయంలో మాఘపౌర్ణమి వ్రతాలను ఆచరించారు. 40 మంది దంపతులు వ్రతాల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, సదానందం, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి)

యాసంగిపై నీలినీడలు

వర్షపాతం వివరాలు(మి.మీలలో)

జిల్లా	సాధారణం	ఇప్పటి వరకు	తగ్గుదల శాతం
రంగారెడ్డి	128.2	77.5	40
మేడ్చల్	129.6	80.3	10
వికారాబాద్	104.9	94.3	38

(ఐదో పేజీ తరువాయి)

వాతావరణ పరిస్థితులు పూర్తిగా దెబ్బతీశాయి. అతి చలి కారణంగా నారు ఎదగలేదు. పోషకాలు అందక చాలా చోట్ల నారు చనిపోయింది. రాష్ట్రంలో పలు జిల్లాల్లో 100శాతం రబీ పంటలు సాగు పూర్తయ్యాయి.

కనీస స్థాయిలో వర్షాలు కరువు

యాసంగి సీజన్‌లో మూడు జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో సాగుకు కీలకమైన నవంబర్, డిసెంబర్ నెలల్లో వర్షాలు పడలేదు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సీజన్‌లో కనీస స్థాయిలో కూడా వర్షాలు లేకపోవడంతోనే రైతులు గట్టెక్కే పరిస్థితి కనిపించడం లేదు. రబీలో రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు సగటు 128.2 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా ఇప్పటి వరకు 77.5మి.మీ మాత్రమే కురిసింది. అంటే 40శాతం లోటు వర్షపాతం నమోదైంది. అలాగే మేడ్చల్ జిల్లాలో 38 శాతం, వికారాబాద్ 10 శాతం తక్కువ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

భూగర్భజలాలు అంతంతమాత్రమే

పలు ప్రాంతాల్లో భూగర్భజలాలు శరవేగంగా తగ్గిపోతుండడంతో యాసంగి సాగు ఇక పెద్దగా పెరిగే అవకాశాలు కనిపించడం లేదు. వేసవికి ముందే భూగర్భజలాలు అడుగంటడంతో పంటలపై తీవ్ర ప్రభావం పడుతోంది. గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి వికారాబాద్ జిల్లాలో 1.64 మీటర్లు తగ్గిపోయాయి. భూగర్భజలాలు 1.05 మీటర్ల లోతుకు పడిపోయాయి. మేడ్చల్ జిల్లాలో 0.86 మీటర్లు తగ్గాయి. వికారాబాద్‌లో యాసంగి సీజన్‌లో కొంత వర్షాలు కురిసినప్పటికీ శరవేగంగా భూగర్భజలాలు పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సగటుకు మించి వర్షపాతం నమోదైంది. ఉమ్మడి జిల్లాలో సగటు కంటే దాదాపు 35శాతానికిపైగా అధిక వర్షపాతం నమోదైంది. ఈ కారణంగా ఉమ్మడి జిల్లాలో భూగర్భజలాలు గణనీయంగానే పెరిగాయి. అయితే యాసంగి సీజన్‌లో వర్షాలు పడలేదు. దీంతో విచ్చలవిడిగా నీటి వాడకం పెరిగి భూగర్భజలాలు శరవేగంగా పడిపోతున్నాయి.



భూగర్భజలాలు ఇలా.. (మీటర్లలో)

జిల్లా	2024 ఫిబ్రవరి1	2025 ఫిబ్రవరి1	వ్యత్యాసం
రంగారెడ్డి	9.08	10.13	1.05
మేడ్చల్	10.35	11.21	0.86
వికారాబాద్	10.65	112.29	1.64

రంగరాజన్‌పై దాడి కేసులో మరో ఐదుగురి రిమాండ్


మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధానార్చకుడు సీఎస్.రంగరాజన్‌పై దాడికి సంబంధించిన కేసులో మరో ఐదుగురిని రిమాండ్‌కు తరలిస్తామని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ బుధవారం పేర్కొన్నారు. బడావతు శ్రీనివాస్(35), దేవిరెడ్డి వీరాబాబు(43), రేగన మూర్తి(46), జనపల గోవిందారావు(46), లక్కోజి వెంకటరమణ(51)లను రిమాండ్‌కు పంపుతామని తెలిపారు. ప్రస్తుతం వీంతా ఏపీలో ఉన్నారని, అక్కడి నుంచి మొయినాబాద్ తరలిస్తున్నామని పేర్కోన్నారు. ఇక్కడికొచ్చిన తరువాత కోర్టు సూచన మేరకు రిమాండ్‌కు తరలిస్తామని, కేసు దర్యాప్తులో ఉందని తెలిపారు.

పోలీసుల అదుపులో ఇద్దరు?

భద్రాచలం: చిలుకూరు ఆలయ ప్రధానార్చకుడు రంగరాజన్‌పై దాడి ఘటనలో బుధవారం సైబరాబాద్ పోలీసులు భద్రాచలంలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఈ సంఘటనలో మొత్తం 15 మంది పాల్గొన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. వారి కోసం అన్వేషిస్తూ వచ్చి ఏపీలోని అల్లూరి జిల్లా వరరామచంద్రాపురం మండలానికి చెందిన ఇద్దరిని భద్రాచలంలో అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తరలించినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే వీరి వివరాలను పోలీసులు బహిర్గతం చేయలేదు.

వీరమోనికుంట ఆక్రమణలపై ఉద్యమాలే!

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు



మాట్లాడుతున్న నర్సింహులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణ శివారు వీరమోనికుంటలో వెలసిన అక్రమ నిర్మాణాలు తొలగించకుంటే తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. బుధవారం షాద్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. వీరమోనికుంట ఆక్రమణ, కట్టడాలకు సంబంధించి పలుమార్లు నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఏఈని సంప్రదిస్తే డీఈని.. డీఈని సంప్రదిస్తే సీఈని కలవాలని కాలయాపన చేస్తున్నారన్నారు. లింగారెడ్డిగూడ సర్వే నంబర్ 26, 27, 28, 29, 30లలో కొన్నేళ్ల కిందటి వరకు రైతులు సేద్యం చేసేవారన్నారు. వీరమోనికుంట అలుగు పొలాల్లోకి రాకుండా పాత హైవే(ఎన్‌హెచ్7)పై కట్టిన బ్రిడ్జి కిందినుంచి గుండ్లకుంట, జగ్గంబావి మీదుగా నీటిని పొలాలకు మళ్లించేవారని చెప్పారు. అయితే ఇటీవల వీరమోనికుంటను శిఖంలోని భూమిని ఓ వ్యక్తి కొని వీరమోనికుంట వరద తన భూమిలోకి రాకుండా కాలువ చుట్టూ ప్రహరీ కట్టించాడన్నారు. దీంతో వర్షపు నీరు పొలాల్లో ప్రవహించి ఇసుక మేటలు వేస్తున్నాయని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు సర్వే చేసి ప్రహరీ అక్రమమని తేల్చారన్నారు. అయితే ఇప్పటి అక్రమ నిర్మాణాన్ని మాత్రం తొలగించలేదన్నారు. వారంలోగా ప్రహరీని తొలగించకుంటే టీడీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని బక్కని అధికారులను హెచ్చరించారు.

జేఈఈలో పరిగి విద్యార్థికి 99.996 స్కోర్



ప్రణవ్‌తేజ్

పరిగి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జేఈఈ(జాయింట్ ఇంజినీరింగ్ ఎంట్రెన్స్) మెయిన్స్‌లో పరిగికి చెందిన విద్యార్థి ఉత్తమ స్కోర్ సాధించాడు. పరిగి టీచర్స్ కాలనీకి చెందిన కనకం గౌరిశంకర్-జయలక్ష్మి దంపతులిద్దరూ టీచర్లు. వీరి కుమారుడు ప్రణవ్‌తేజ్ జేఈఈలో మెయిన్స్‌లో 99.996స్కోర్ సాధించాడు. అయితే నిర్వాహకులు ర్యాంక్‌లను తర్వాత ప్రకటిస్తారని, జాతీయ స్థాయిలో 20లోపు ర్యాంకొచ్చే అవకాశ ఉందన్నారు. ప్రణవ్ తేజ్ టెన్త్, ఇంటర్‌లు మాదాపూర్‌లో ప్రైవేట్ కాలేజీలో చదివాడు.

యంనంపేట్ విద్యార్థికి 98.4శాతం స్కోర్



నందీశ్వర్‌రెడ్డి

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ పరిధి యమ్నంపేట్‌లోని రాక్‌వుడ్స్ జూనియర్ కాలేజీలో 12వ తరగతి విద్యార్థి గుజ్జుల నందీశ్వర్‌రెడ్డి జేఈఈ మెయిన్స్ సెషన్ 1లో 98.4శాతం స్కోర్ సాధించాడు. విద్యార్థి టాప్ స్కోర్ సాధించడంతో బుధవారం కాలేజీ యాజమాన్యం సత్కరించింది. జ్ఞాపికను బహూకరించారు.



సీజ్ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

21 రెడీమిక్స్ ప్లాంట్ల సీజ్

శంషాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధి కొత్వాల్‌గూడ పరిసరాల్లో అనుమతుల్లేకుండా నిర్వహిస్తున్న రెడీమిక్స్ ప్లాంట్లను బుధవారం మండల రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. కొత్వాల్‌గూడ, ఔటర్ రింగ్ రోడ్డు, సర్వీసు రోడ్డు ప్రాంతాల్లో అనుమతుల లేకుండా 21సిమెంట్ మిక్సింగ్ ప్లాంట్లను నిర్వహిస్తున్నారు. ఈ ప్లాంట్ల నుంచి వస్తున్న దుమ్ము, ధూళితో పరిసర నివాసాలు, పొలాలు, రోడ్లు పాడవుతున్నాయి. దుమ్ముతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాలుష్యానికి కారకమవుతున్న ఈ ప్లాంట్లన్నీ తొలగించాలని సమీప గ్రామాల ప్రజలు ఎన్నోసార్లు అధికారులకు విన్నవించారు. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు అనుమతుల్లేని 21 రెడీమిక్స్ ప్లాంట్లను సీజ్ చేశారు.



ఆక్రమణల కూల్చివేత

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి గౌడవెల్లిలో ప్రభుత్వ జాగాలో ఇండ్లు కట్టారని స్థానికుల ఫిర్యాదు చేయడంతో బుధవారం రెవెన్యూ అధికారులు స్పందించి నిర్మాణాలను కూలగొట్టారు. గౌడవెల్లిలో ఇళ్లు లేని పేదలకు సర్వే నంబర్ 341లోని సర్కారీ జాగాలో గతంలో పట్టాలిచ్చారు. పట్టాలు పొందిన వారు, మరి కొందరు కొన్ని రోజుల క్రితం రాత్రికి రాత్రే ఇళ్లు నిర్మించుకున్నారని స్థానికులు తహసీల్దార్ శైలజకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారి సిబ్బందిని పంపి అక్రమంగా కట్టిన రెండిళ్లను తొలగించారు. ఇదిలా ఉంటే ఇదే స్థలంలో ఇళ్ల పేదలు కొందరు తాత్కాలిక నివాసాలు ఏర్పర్చుకున్నారని చెప్పారు. పట్టాలు పొందిన వారి వివరాలు సేకరించి, సర్వే చేసి ఆక్రమణలను తొలగిస్తామని, అర్హులకే ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

తీన్మార్ మల్లన్నపై పీఎస్‌లో ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు చేస్తున్న మదన్మోహన్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కులాల మధ్య చిచ్చుపెడుతూ రెడ్లను దూషిస్తున్న ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ అలియాస్ తీన్మార్ మల్లన్నపై చట్టపర చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ రెడ్డి సంక్షేమ సమితి డిమాండ్ చేసింది. రెడ్డి సంక్షేమ సమితి అధ్యక్షుడు కొప్పుల మదన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సీఐ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవ చేయాల్సిన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ కులాల మధ్య చిచ్చుపెడుతున్నాడన్నారు. స్వప్రయోజనం కోసం కొందర్ని రెచ్చగొడుతూ, రెడ్డి కులస్తులను కించపరుస్తూ మాట్లాడుతున్న చింతపండు.. ఎమ్మెల్సీ పదవికి అనర్హుడన్నారు. అతడిపై సీఎం రేవంత్‌రెడ్డి చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో రెడ్డి సేవా సమితి నాయకులు జి.రవీందర్‌రెడ్డి, ఎం.నర్సింహారెడ్డి, ఎడ్మ రఘుమారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, రఘుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

కేసీఆర్ దేవుడు ..

ఏమియ్యకున్నా నీళ్లిచ్చి బతికించాడన్న మహిళ

సోషల్ మీడియాలో వైరల్



బొంరాస్‌పేట్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి):"కేసీఆర్ దేవుడు. పేదలకు ఆయన ఏం ఇవ్వకున్నా నీళ్లిచ్చి బతికిచ్చిండు." అని అన్న ఓ మహిళ వీడియో సోషల్ మీడియాలో వైరలవుతోంది. గత ఆదివారం కేటీఆర్ కొడంగల్ పర్యటన సందర్భంగా తుంకిమెట్లలో బీఆర్ఎస్ జెండావిష్కరణకు దిమ్మెను ఏర్పాటు చేశారు. చౌదర్‌పల్లికి చెందిన కావలి సాయిలమ్మ బుధవారం మన్యంకొండ వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్తూ బీఆర్ఎస్ జెండా దిమ్మెను చూసి ఆగారు. దిమ్మెకు అగరొత్తులు వెలిగించి పూజ చేయడాన్ని యువకులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్‌చేశారు. 'కాంగ్రెసోళ్లు నొచ్చుకున్నా.. ఎవరేమి అనుకున్నా కేసీఆర్ దేవుడు.' అని సాయిలమ్మ అంటున్న వీడియో చక్కర్లు కొడుతోంది.



జేపీ దర్గాలో ప్రార్థన చేస్తున్న విశ్వక్సేన్

జేపీ దర్గాను దర్శించుకున్న నటుడు విశ్వక్సేన్

కొత్తూర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఇన్ముల్‌నర్వలో గల ప్రముఖ హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గాను సినీ నటుడు విశ్వక్సేన్ బుధవారం దర్శించి ప్రార్థనలు చేశారు. నటుడు తన కుటుంబీకులతో చాదర్‌ను తలపైపెట్టుకుని దర్గాకు వచ్చారు. ముజావర్లు వారికి తలపాగా చుట్టి స్వాగతం పలికారు. అనంతరం విశ్వక్సేన్ దర్గాలో ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా హీరో మాట్లాడుతూ.. జేపీ దర్గా అంటే తనకు ఎంతో ఇష్టమని, చిన్నప్పటి నుంచే దర్గాకు వచ్చేవాడినన్నారు. తాను నటించిన లైలా సినిమా ఈ నెల 14న రిలీజ్ అవుతుందని, ఈ చిత్రం గ్రాండ్ సక్సెస్ కావాలని దర్గాలో బాబాకు మొక్కుకున్నానని తెలిపారు. అంతకు ముందు విశ్వక్సేన్‌కు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అతడిని చూసేందుకు భారీగా తరలివచ్చారు.



వర్షితను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ ఇషత్, పీడీ హైమవతి తదితరులు

గురుకుల క్రీడాకారిణికి గోల్డ్ మెడల్

శామీర్‌పేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేటలోని ప్రభుత్వ గురుకుల మహిళా డిగ్రీ కాలేజీకి చెందిన క్రీడాకారిణి సల్వరి వర్షిత(20) సీనియర్ స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించింది. వర్షిత ఇక్కడి జగద్గిరిగుట్ట గురుకులంలో బీకాం ఫైనలియర్ చదువుతోంది. ఆమె స్వస్థలం సికింద్రాబాద్. లాలాపేటలోని స్పోర్ట్స్ స్టేడియంలో మంగళవారం సీనియర్స్ స్టేట్ బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ కాలేజీల నుంచి 40 మంది క్రీడా కారిణులు వివిధ కేటగిరీల్లో పాల్గొన్నారు. వర్షిత 54-57కిలోల వెయిట్ క్యాటగిరీలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. తెలంగాణ స్టేట్ బాక్సింగ్ ఫెడరేషన్ అసోసియేషన్ ఆమెకు గోల్డ్‌మెడల్ ప్రదానం చేసింది. వర్షిత నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైంది. జాతీయ స్థాయి పోటీలు ఫిబ్రవరి 22 నుంచి 28వ తేదీ వరకు ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నోలో జరుగుతాయి. కాగా వర్షితను లేడీ కాలేజీ ప్రిన్సిపాల్ ఇషత్, ఫిజికల్ డైరెక్టర్ హైమవతి, వైస్ ప్రిన్సిపాల్ చేతన, అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ స్రవంతి, హౌస్ మాస్టర్ అనుపమ, లెక్చరర్లు ఘనంగా సన్మానించారు.

మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి పూజలు



పూజల్లో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తదితరులు

దుద్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలం అల్లిఖాన్‌పల్లి గ్రామ శివారులో గల మర్రికుంట శివాలయంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, హోమం తదితర పూజా కార్యక్రమాలు గావించారు. బొంరాస్‌పేట్ మండలం జానకంపల్లిలోనూ శివస్వాముల పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, మహేందర్, నరేశ్‌గౌడ్, బసప్ప, బసిరెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ నల్లా బిల్లులు రద్దు చేయాలి



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : బకాయి పడ్డ నల్ల బిల్లులను వెంటనే మాఫీ చేయాలని బీజేపీ మేడ్చల్ పట్టణ అధ్యక్షురాలు శైలజ హరినాథ్ డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట పార్టీ నేతలు నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఉచితంగా నల్లా కనెక్షన్ ఇచ్చి నిరుపేదల నుంచి పెద్ద మొత్తంలో బిల్లులు వసూలు చేయటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బకాయి పడినవి పక్కన బెట్టి ఒక సంవత్సరానికి చెందిన బిల్లులను మాత్రమే వసూలు చేయాలని కోరారు. బలవంతంగా వసూలు చేయాలని భావిస్తే మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికీ బదిలీ సహజం



కార్యదర్శులను సన్మానిస్తున్న రవిసాగర్

పరిగి,ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికీ బదిలీలు సహజమని పరిగి మాజీ ఉపఎంపీపీ ఉప్పరి రవిసాగర్ అన్నారు. మండలంలోని రాపోల్ కార్యదర్శిగా పని చేసి బదిలీ అయిన శ్రీనివాస్, కొత్తగా రాపోల్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన బుచ్చయ్యలను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ, ఇప్పటి వరకు పని చేసిన శ్రీనివాస్ అందుబాటులో ఉండి సేవలు అందించారని, ఇదే స్ఫూర్తితో కొత్త కార్యదర్శి అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ప్రభులింగం, జగన్, విజయ్‌కుమార్, ఖాదర్, రఫీ, రాజు, మైబెల్లి, అశోక్, వెంకటయ్య, రామయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న సమానత్వ సమాఖ్య రాష్ట్ర నాయకురాలు కృప

వికారాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం విద్యకు 15 శాతం నిధులను కేటాయించాలని తెలంగాణ ఆడ పిల్లల సమానత్వ సమాఖ్య రాష్ట్ర నాయకురాలు కృప అన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు అన్ని రకాల విద్యాసంస్థలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. బుధవారం పట్టణంలో ఉన్న గెస్ట్‌హౌస్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నాడు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ 6 శాతం విద్యకు ఖర్చు చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కేవలం 7.3 శాతం బడ్జెట్ కేటాయించిందని అన్నారు. సమావేశానికి పలు సంఘాల ప్రతినిధులు మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సానియా, వివరాజ్, నాగరాజు, రేణుక, సంజన, సతీష్, గీత, శ్రీనివాస్, ఆశాలత, దేవికుమారి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

సరైన భోజనం పెడుతున్నారా?



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ వెంకటేష్

బషీరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): భోజనం విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని బషీరాబాద్ తహసీల్దార్ వై. వెంకటేష్ విద్యార్థినులను అడిగారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. తరగతి గదుల్లో వెళ్లి.. విద్యార్థినులతో బోధన అంశలపై చర్చించారు. అనంతరం వంటగదిలోకి వెళ్లి వండి పెట్టిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం వారితో కలిసి వెంకటేష్ భోజనం చేశారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

శివస్వాముల మహాపడి పూజ

దుద్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండల కేంద్రంలోని నాంగారి హనుమంతుగౌడ్ ఇంట్లో బుధవారం శివస్వాములు మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. పరమేశ్వరుడికి రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శివస్వాములు ప్రభాకర్ యాదవ్, నర్సిములుగౌడ్, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోస్గిలో కేటీఆర్‌ది దొంగ దీక్ష

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



తాండూరు రూరల్: గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, ఫిబ్రవరి 12, (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, రోజురోజుకూ ఆపార్టీ ఉనికి కోల్పోతుందనే భయంతోనే కేసీఆర్, కేటీఆర్ కోస్గిలో దొంగదీక్ష చేపట్టారని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పరిపాలించినా రూ.10వేల కోట్లే రుణమాఫీ చేసిందన్నారు. కేటీఆర్ ప్రజల్లో వెళ్లి పార్టీ పురోగతిని సాధించాలన్న ఉద్దేశంతో దొంగదీక్ష చేశారని తెలిపారు.

గోదాంను సద్వినియోగం చేసుకోవాలి

మండల పరిధిలోని అల్లాపూర్ గ్రామ శివారులో ఉన్న ఎల్మకన్నె సహకార సంఘం గోదాంను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం డీసీసీ ఉపాధ్యక్షుడు, ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో గోదాంను ప్రారంభించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు సురేందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాఘవేందర్, సహకార సంఘం సీఈవో శ్రీనివాస్, అడిషనల్ సీఈవో చంద్రారెడ్డి, గంగాధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉత్తం చంద్ పాల్గొన్నారు.

సబ్సిడీని వినియోగించుకోండి

రైతులు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తాండూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నియోజకవర్గానికి చెందిన 137 మంది రైతులకు 137 యూనిట్ల స్ప్రింక్లర్లను అందజేశారు.

మహిళకు ఉపాధి కల్పిస్తాం

పెద్దేముల్ : ప్రయత్నం చేస్తేనే ఎందులోనైనా విజయం వరిస్తుందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కందనెల్లిలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మూడు నెలల పాటు మహిళలు కుట్టుమిషన్ శిక్షణ తీసుకున్నారు. ఈ సందర్భంగా మంజూరైన మిషన్లను బుధవారం వారికి అందజేశారు. కుట్టుమిషన్ శిక్షణ ఇస్తే సరిపోదని, వారికి పని కూడా కల్పించాలనే ప్రయత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈడీ బాబుమోషన్, ఏఎంసీ చైర్మన్ అంజయ్య, మాజీ వైస్ఎంపీపీ మధులత, ఏబ్లాక్ అధ్యక్షుడు లొంకనర్సిములు పాల్గొన్నారు.

ప్రెస్‌భవన్ ఏర్పాటుకు భవన సౌకర్యం...

తాండూరు పట్టణంలోని జర్నలిస్టుల కోసం ప్రెస్‌భవన్ ఏర్పాటుకు భవన సౌకర్యం కల్పిస్తానని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. కందనెల్లి సమీపంలోని జీపీఆర్ గార్డెన్‌లో బుధవారం టీయూడబ్ల్యూజే ఐజేయూ డివిజన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ప్రెస్‌క్లబ్ ఏర్పాటు కోసం ఖాళీగా ఉన్న దూరదర్శన్ కేంద్రం భవనాన్ని తాత్కాలికంగా ప్రెస్‌భవనం ఏర్పాటుకు తోడ్పాటునందించాలని వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై హామీ ఇచ్చారు. టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్రకౌన్సిల్ సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసచారి, వాసు, ప్రభాకర్, లింగేష్, నర్సింహులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం కాకుండా

చర్యలు తీసుకోండి

కలెక్టర్, డీఈవోలకు వినతి

బషీరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధి పనుల నిధులు దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని మండలంలోని ఎక్మాయి గ్రామ విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. బుధవారం కలెక్టర్, డీఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.. స్థానిక హరిజనవాడ పాఠశాలకు అమ్మఆదర్శ పాఠశాల కింద రూ.6.20లక్షలు నిధులు మంజూరయ్యాయని, అసంపూర్తిగా పనులు చేసి నిధులు డ్రా చేసుకునేందుకు గ్రామ సమాఖ్య సభ్యులు అంబికా, స్వరూప, రెహనా ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలలో చిన్న, చిన్న పనులు చేపట్టి ఇప్పటికే రూ.1.56 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నారన్నారు. పనులు పూర్తి కాకుండానే పీఆర్ ఏఈ రికార్డు చేశారన్నారు. ఇందుకు డీఈవో కార్యాలయంలో పని చేస్తున్న ఓ అధికారి సహకరిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్‌తో అందరూ కుమ్మక్కై పాఠశాలకు మంజూరైన మొత్తం నిధులు డ్రా చేసుకునేందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని బెదిరిస్తున్నారన్నారు. వెంటనే ఈ విషయమై విచారించాలని మాజీ ఎంపీటీసీ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు.

15న వేలం పాట

మర్పల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మర్పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న ఒక షెట్టర్ దుకాణం అద్దె ప్రాతిపాదికన ఇచ్చేందుకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజమల్లయ్య బుధవారం పేర్కొన్నారు. ఈనెల 15న జరిగే వేలంలో ఆసక్తిగల వారు పాల్గొనాలన్నారు. ఎవరైతే ఎక్కువ ధరకు టెండర్ వేస్తారో వారికి దుకాణాన్ని ఒప్పందం మేరకు ఇస్తామని పేర్కొన్నారు.

స్టూడెంట్ క్లబ్ ప్రారంభం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం తర్మెక్స్ స్టూడెంట్ క్లబ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అపూర్వ కుమార్ మాట్లాడుతూ లిక్విడ్ సోడియం ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. బాయింగ్ ఇన్ లిక్విడ్ సోడియం గురించి పలు విషయాలు తెలిపారు. కార్యక్రమంలో డీన్ విజయ్‌కుమార్, మహిపతి శ్రీనివాస్‌రావు, కె. శ్రీనివాస్ చలపతి, అధ్యాపకులు సికిందర్‌బాబా, క్రిష్ణయ్య, విశ్వనాథ్ అరుణ్‌రెడ్డి, మద్దిలేని శ్రీకాంత్, సందీప్ కుమార్, అమరేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు

పార్టీల ప్రతినిధులతో సమావేశం

కోట్‌పల్లి, ఫిబ్రవరి12(ఆంధ్ర జ్యోతి): రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం ఉదయం 11.30 గంటలకు తన కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీవో డానియల్ బుధవారం తెలిపారు. ఈ సమావేశం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఇతర అంశాలపై చర్చిస్తామని పేర్కొన్నారు. వివిధ పార్టీల మండల అధ్యక్షులు, కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

చౌడాపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండలం మక్త వెంకటాపూర్‌లో నూతనంగా నిర్మించిన గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్, మరియమ్మ యాడీల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను గురువారం నిర్వహిస్తారు. ఆ మేరకు నాభిశిల, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

రేపటి నుంచి ఈదరమ్మ జాతర

నవాబుపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నవాబుపేట మండలం అక్నాపూర్‌లో వెలిసిన ఈదరమ్మ జాతర ఉత్సవాలను ఈ నెల 14 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ మాజీ సర్పంచ్ తలారి అజయ్‌కుమార్ బుధవారం పేర్కొన్నారు. బోనాల ఊరేగింపు, భజనలు, పూజా కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా స్వామివారి పల్లకీ సేవ

పరిగి,ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పరిగి మండలం మిట్టకోడూరులో మాణిక్యప్రభువుల వారి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజైన బుధవారం వార్షికోత్సవాల్లో భాగంగా స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. కోలాటాలు, నృత్యాలు, భజనలతో ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. అంతకుముందు భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



రథోత్సవంపై దేవతామూర్తులు

వేణుగోపాలస్వామి రథోత్సవం

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి రథోత్సవం కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్‌లో.. ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం నిర్వహించిన ఉరేగింపులో డప్పు చప్పుళ్లు, కోలాటాలు అందరినీ అలరించాయి. గ్రామంలోని ప్రధాన చౌరస్తా నుంచి రథోత్సవాన్ని తిరిగి ఆలయానికి తీసుకెళ్లారు. తొలుత స్వామికి ప్రత్యేక పూజలతో పాటు అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు అంబారిపేట వంశస్తులు, గ్రామస్తులు, భక్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వార్షిక బ్రహ్మోత్సవాలు



పూజల్లో భక్తులు

దౌల్తాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలంలోని గోకఫస్లాబాద్ సమీపంలో గుట్టపై వెలిసిన తిరుమలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, హోమం, కల్యాణోత్సవం తదితర విశేషల పూజలు నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం బసదేశ్వర ట్రేడర్స్ అవిటి సిద్దేశ్వర్ దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కేశవరెడ్డి, ఆర్.రామకృష్ణారెడ్డి, భీమ్‌రెడ్డి, సతీశ్‌ముదిరాజ్, అనంతయ్య, బస్వరాజ్, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్రాములుచారి, బుగ్గప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రుద్రహోమం



రుద్రహోమంలో శ్రీధర్‌రెడ్డి దంపతులు

కులకచర్ల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మండలం బండవెల్కిర్ల పాంబండ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం రుద్రహోమం ఘనంగా నిర్వహించారు. ప్రతీనెల పౌర్ణమి రోజు ఉదయం 10 గంటలకు రుద్రహోమం నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ మైపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి దంపతులు, రైస్‌మిల్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాండుశర్మ, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పదస్థితిలో గర్భిణి మృతి

బంట్వారం ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా ఓ గర్భిణి మృతిచెందిన సంఘటన బంట్వారం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగు చూసింది. ఎస్ఐ శ్రీశైలం తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని తొరుమామిడికి చెందిన ముస్కాన్ బేగం (21) ఎనిమిదో నెల గర్భిణి. అనారోగ్య సమస్యలతో కొద్దిరోజుల క్రితం అబర్షన్ అయింది. మెరుగైన సేవల కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చేరారు. ఇక్కడ చికిత్సపొందుతూ మంగళవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో మృతిచెందింది. కుమార్తె మృతి పట్ల అనుమానం ఉందని తండ్రి షేక్ జమీరుద్దీన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు వారు తెలిపారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



రవీందర్ మృతదేహం

బషీరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బషీరాబాద్ మండలం మర్పల్లిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన గొట్టిగ కిష్టప్ప కుమారుడు రవీందర్(19) ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. కొంత కాలంగా అతడు లోలోల అంతర్మథనం చెందుతున్నాడు. అదే రోజు మధ్యాహ్నం సమయంలో ఇంట్లోంచి వెళ్లి పోయి గ్రామంలోని ఓ రోడ్డు పక్కనున్న వేపచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.శంకర్ తెలిపారు.

బెల్టు షాపు నిర్వాహకుల బైండోవర్



బైండోవర్ అయిన బెల్టుషాపుల నిర్వాహకులు

మోమిన్‌పేట్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బెల్టు షాపుల నిర్వాహకులులైన ఏడుగురిని బైండోవర్ చేశారు. మోమిన్‌పేట్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బెల్టు షాపు నిర్వాహకులు ఏడుగురిని బుధవారం తహసీల్దార్ మనోహరచక్రవర్తి ఎదుట ఎక్సైజ్ పోలీసులు బైండోవర్ చేశారు.

అర్చకుడు రంగరాజన్‌కు పరామర్శ

కొడంగల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ దేవస్థాన ప్రధాన అర్చకుడు రంగరాజన్‌ను తెలంగాణ ధూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు కలిశారు. ఆ మేరకు బుధవారం ఆయన్ను పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరునగరి వెంకటాద్రి స్వామి, అన్నవర్జుల ప్రసాద్‌శర్మ, భార్గవ చార్యులు, జయతీర్థచారి, లక్ష్మీకాంత్‌చారి, సంతోస్ శాస్త్రి, పాడిమెట్ల శివ ప్రసాద్, కూర్మచలం, శ్రీనివాస్, గాజుల మొండయ్య, జంగం మహేశ్, రవికుమార్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్ : చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య అని బీజేపీ అర్చక సెల్ కన్వీనర్ మఠం వీరేశం స్వామి ఖండించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయనపై దాడికి పాల్పడిన దుండగులను ప్రభుత్వం చట్టరీత్యా శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

సదుపాయాలు కల్పించేందుకు కృషి



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న నాగవర్ధన్

పరిగి,ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకారంతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కృషి చేస్తున్నామని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి నాగవర్ధన్ అన్నారు. ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా రూ.5 లక్షల నిధులతో బుధవారం డ్రైనేజీ పనులను ప్రారంభించారు. రాపోల్‌లోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్, ఉపాధ్యక్షుడు రాకేష్, మండల కోశాధికారి విశ్వాచారి, రాంచంద్రయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ధారాసింగ్

పెద్దేముల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో సీసీరోడ్డు పనులను బుధవారం టీపీసీసీ ప్రధానకార్యదర్శి ధారాసింగ్ ప్రారంభించారు. గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.6 లక్షలు మంజూరయ్యాయి. ఆ మేరకు టెంకాయ కొట్టి పనులను ప్రారంభించారు.

కనుల పండువగా కల్యాణాలు

- ప్రత్యేక అలంకరణలో దేవతామూర్తుల దర్శనం
- పులకించిన భక్తజనం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న శివపార్వతులు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. గ్రామంలోని నాగలింగేశ్వర ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులను ఊరేగించారు. ఉదయం సుప్రభాతం, రుద్రాభిషేకం గావించారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శివస్వాములు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తాండూరు రూరల్, ఫిబ్రవరి 12, (ఆంధ్రజ్యోతి) : శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. తాండూరు మండలం అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్‌లో.. స్వామి వారి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా గంగిశెట్టి శ్రీనివాస్, అనురాధ, రాఘవాచార్ శుక్రవార్, నిర్మల దంపతులు కూర్చోని కల్యాణం జరిపించారు. దేవాలయ ప్రాంగణంలో స్వామివారి రథోత్సవం కనుల పండువగా సాగింది. సాయంత్రం స్వామివారి అశ్వవాహన సేవ జరిగింది.



విశేష అలంకరణలో దేవతామూర్తులు



మరికల్‌లో రథోత్సవంలో గ్రామస్తులు

చౌడాపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చౌడాపూర్ మండలం మరికల్‌లో బుధవారం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రథోత్సవం, స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. చౌడాపూర్ మండలంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మొక్కులు తీర్చారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గురువారం శకటోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పురోహితులు, భారీ సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.